జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట







బుధవారం, జూలై 1, 2026 పేజీలు : 3

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలను

# మోసం చేస్తోంది

- జడ్చర్లలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

-- సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు



జడ్చర్ల, జూన్ 30 ( ప్రజా జ్యోతి )
జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై అవగాహన సదస్సు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, విద్యార్థులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం, త్యాగాల గురించి మాట్లాడే నైతిక హక్కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. 2009లో టికెట్ రాకపోయినా పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించేందుకు కృషి చేసిన నాయకుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి అని కొనియాడారు. 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు వాస్తవానికి రైతుల వంచన సభలేనని పేర్కొన్నారు. యాసంగి రైతు బంధు బకాయిలు చెల్లించకుండా, ఇప్పుడు వానాకాలం రైతు బంధు ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ హామీని ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.

రైతు బంధు కింద వేల కోట్ల రూపాయలు రైతులకు బాకీ ఉన్నాయని, రైతు బీమా పథకం అమలులో కూడా నిర్లక్ష్యం చోటుచేసుకుందని అన్నారు. ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించకపోవడంతో వేలాది రైతు కుటుంబాలు బీమా

# భవిష్యత్ కోసమే
# నా రాజకీయాలు

-ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

-ట్రిపుల్ ఐటీలో 65 శాతం స్థానిక విద్యార్థులు ప్రవేశం

- ప్రభుత్వ పాఠశాలల ఫలితాల్లో రికార్డు





# బాలకార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం మోపాలి

-జిల్లా ఎస్పీ జానకి -ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్, జూన్ 30 ( ప్రజా జ్యోతి బ్యూరో )
మహబూబ్‌నగర్ జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి అధికారులను ఆదేశించారు.
జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్--శ×× కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఆపరేషన్ ముస్కాన్ బృందంతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలను బాలకార్మికులుగా పనిచేయించడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, తిరిగి పాఠశాలల్లో చేర్పించడం లేదా అవసరమైతే ప్రభుత్వ సంరక్షణ గృహాలకు తరలించే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అదే నేరాన్ని పునరావృతం చేసిన వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు తాత్కాలిక ప్రయోజనాల కోసం పిల్లలను పనులకు పంపించి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు. పిల్లలను చదువు మాన్పించి పనులకు పంపిస్తున్న తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు, బలవంతంగా పని చేయిస్తున్న చిన్నారులు, భిక్షాటన చేస్తున్న పిల్లలు, ఆశ్రయం

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలను మోసం చేస్తోంది

సాయం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. కేసీఆర్ హయాంలో కరోనా, కరువు వంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా రైతు బంధు పథకం ఆగలేదని, 11 విడతల్లో రూ.73 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆరోపించారు.

వ్యవసాయ రంగంలో ఎరువుల కొరత, విద్యుత్ సరఫరా సమస్యలు పెరిగాయని, రైతు డిస్కంల పేరుతో 24 గంటల ఉచిత విద్యుత్‌కు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

పాలమూరు ప్రాంత అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదని ఆరోపించారు.

తుంగభద్ర, కృష్ణా నదులపై పొరుగు రాష్ట్రాలు చేపడుతున్న ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పాలమూరు--రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టుల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో వారి చదువులు దెబ్బతింటున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. వృద్ధాప్య పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు.



ఇటీవల జరిగిన పారిశ్రామిక ప్రమాదాల్లో మరణించిన బాధిత కుటుంబాలకు ప్రకటించిన పరిహారం ఇప్పటికీ అందలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రజా సమస్యలపై చర్చలు నిర్వహిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో పాలమూరు జిల్లాలోని అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని, పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో మాజీ మంత్రులు మహమ్మద్ అలీ, డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, అంజయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వాల్యా నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, రజనీ సాయిచంద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థపై
# ఉక్కుపాదం మోపాలి

అవసరమైన బాలలు లేదా తప్పిపోయిన వీధి బాలలు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్--100కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (ఎన్‌బీ) రత్నం, సీడబ్ల్యూసీ చైర్మన్ నయీముద్దీన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, ఆపరేషన్ ముస్కాన్ టీమ్ ఎస్సై లెనిన్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జులై 2న కల్వకుర్తిలో విజయోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి, జూన్30 (ప్రజా జ్యోతి)

ప్రజాపాలన ప్రగతి నివేదిక బస్సు యాత్ర విజయవంతంగా ముగిసిన సందర్భంగా జులై 2న కల్వకుర్తిలో 'విజయోత్సవ భారీ బహిరంగ సభ' నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.జులై 2, మధ్యాహ్నం 2:00 గంటలకు

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, ఏర్పాటు చేస్తున్నామన్నారు

ఈ విజయోత్సవ సభకు మంత్రులు జూపల్లి కృష్ణారావు,దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి,ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, జనంపల్లి అనిరుధ్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, తుడి మేఘా రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజాపాలన ప్రగతి నివేదిక బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దీని ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవ సభను చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేద్దాం. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు వేలాదిగా తరలిరావాలి" అని కోరారు.ప్రజాపాలనలో సాధించిన ప్రగతిని వివరించడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణను ఈ సభ వేదికగా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ జిల్లెల్ల రాములు, భూపతి రెడ్డి, వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, కౌన్సిలర్ సర్పంచులు ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## భవిష్యత్ కోసమే
# నా రాజకీయాలు

మహబూబ్‌నగర్, జూన్ 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ) చిల్లర రాజకీయాల కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని, భవిష్యత్ మహబూబ్‌నగర్ అభివృద్ధి, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసమే రాజకీయాలు చేస్తున్నానని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో ఈ ఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థుల్లో 65 శాతం మంది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారే కావడం గర్వకారణమని అన్నారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.600 కోట్లు మంజూరు చేయించుకున్న దానికంటే కూడా ఈ విజయం తనకు మరింత సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు.

గత ఏడాది స్థానిక విద్యార్థులు తక్కువ సంఖ్యలో ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందిన నేపథ్యంలో, ఈసారి అధిక సంఖ్యలో స్థానిక విద్యార్థులు సీట్లు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించామని, "శతశాతం" కార్యక్రమం కింద సొంత నిధులతో ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా వాలంటీర్లను నియమించి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించామని వివరించారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలను లక్ష్యంగా చేసుకుని 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ నిర్వహించామని, ప్రవేశ పరీక్ష ద్వారా 170 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉచిత శిక్షణ అందించామని చెప్పారు. ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో జిల్లా విద్యార్థులు అధిక సంఖ్యలో చేరేలా "శతశాతం" కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి దరఖాస్తుల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగి సుమారు 33 వేల వరకు చేరిందని, గత ఏడాది 19,720 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని వెల్లడించారు. ఇది జిల్లాలో విద్యపై పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మాల మమత, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్.పీ. వెంకటేష్, సీజే బెనహర్, జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు శాంతన్న యాదవ్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి. మహేందర్, కార్పొరేటర్ మజ్జీద్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్-25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

వడ్డేపల్లి జూన్ 30(ప్రజా జ్యోతి):శాంతినగర్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం రాఘవేంద్ర కాలనీలో విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.శాంతినగర్ సీఐ ఆధ్వర్యంలో రాజోలి,మానపాడు ఎస్సైలు, సుమారు 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొని కాలనీలోని ప్రతి ఇంటితో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని,అనుమానాస్పదంగా ఉన్న 25 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అనంతరం కాలనీ వాసులతో సమావేశమైన పోలీసులు,కాలనీలోకి కొత్తగా వచ్చే అనుమానాస్పద వ్యక్తుల వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.యువత మత్తు పదార్థాలు,డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఇటీవల పెరుగుతున్న ఇంటి దొంగతనాలు,సెల్‌ఫోన్ చోరీలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల విధించే జరిమానాలపై కూడా స్థానికులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా శాంతినగర్ సీఐ మాట్లాడుతూ,ప్రజల సహకారంతోనే కాలనీల్లో శాంతిభద్రతలను సమర్థంగా పరిరక్షించగలమని అన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనిస్తే వెంటనే డయల్--100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.





# దేవరకద్రలో జూలై 2న నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

మహబూబ్ నగర్ జూన్ 30 ( ప్రజా జ్యోతి బ్యూరో )

దేవరకద్ర పట్టణ కేంద్రంలో నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జూలై 2 (గురువారం) ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఆనందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, మహబూబ్‌నగర్ జిల్లా కోర్టుల పరిపాలనాధికారి ఎన్.వి. శ్రవణ్ కుమార్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి టి. మాధవి దేవి హాజరవుతారని వెల్లడించారు.అలాగే జిల్లా న్యాయమూర్తులు, జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుడు మన్యం వెంకట్ రెడ్డి విగ్రహావిష్కరణ

**- ఉద్యమకారుల త్యాగాలను ఎప్పటికీ మరువలేం**
**- మాజీ మంత్రి హరీశ్ రావు**

మిడ్జిల్/జడ్చర్ల, జూన్ 30 ( ప్రజా జ్యోతి ) మిడ్జిల్ మండల కేంద్రం మంగళవారం గులాబీ జెండాలతో కళకళలాడింది. తెలంగాణ ఉద్యమకారుడు దివంగత మన్యం వెంకట్ రెడ్డి విగ్రహాన్ని మాజీ మంత్రులు హరీశ్ రావు, డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. అనంతరం మన్యం వెంకట్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ, మన్యం వెంకట్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకర విషయమన్నారు. ఉద్యమకారులను గౌరవించే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీలో ఎప్పటికీ కొనసాగుతుందన్నారు. కష్టకాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆదుకునే వాతావరణం బీఆర్ఎస్‌లో ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ రాష్ట్రాన్ని సాధించి కార్యకర్తల ఆత్మగౌరవాన్ని పెంచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించిన హరీశ్ రావు, తెలంగాణ ఉద్యమం కోసం ఆయన పోరాడలేదని ఆరోపించారు. అబద్ధాలు, మాయమాటలతో అధికారంలోకి వచ్చారని, పాలమూరు జిల్లా ప్రయోజనాలను విస్మరిస్తున్నారని విమర్శించారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు కృష్ణా, తుంగభద్ర జలాలను వినియోగించుకుంటున్న నేపథ్యంలో తెలంగాణ హక్కులను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందనిఅన్నారు. మిడ్జిల్ ప్రాంతానికి సాగునీరు అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.కార్యకర్తలు చూపుతున్న ఆదరణ, అభిమానాన్ని



చూస్తుంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమనే విశ్వాసం కలుగుతోందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.
మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, మన్యం వెంకట్ రెడ్డి మిడ్జిల్ గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. అనేక సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. కార్యకర్తలే స్వచ్ఛందంగా చందాలు సేకరించి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. మన్యం వెంకట్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన వినూత్నకు జిల్లా ఎస్పీ జానకి సన్మానం

**- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**



**మహబూబ్‌నగర్, జూన్ 30 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో విశిష్ట ప్రతిభ కనబరచి కాంస్య పతకం సాధించిన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విద్యార్థిని కుమారి వినూత్నను జిల్లా ఎస్పీ దరావత్ జానకి మంగళవారం ఘనంగా సన్మానించారు. డీపీఆర్ మహబూబ్‌నగర్‌లో ఆర్ఐ (అడ్మిన్)గా విధులు నిర్వహిస్తున్న కృష్ణయ్య కుమార్తె అయిన వినూత్న, స్పోర్ట్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ మహబూబ్‌నగర్ జిల్లా తరఫున పోటీల్లో పాల్గొని 28 కేజీల విభాగంలో పాయింట్ ఫైట్ విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో జిల్లా ప్రతిష్టను జాతీయ స్థాయిలో నిలబెట్టింది. మాస్టర్ రవికుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందిన వినూత్న జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తన చాంబర్‌లో వినూత్నను సన్మానించి అభినందించారు. ఆమె సాధించిన విజయం మహబూబ్‌నగర్ జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో వినూత్న మరింత ఉన్నత స్థాయిలో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) కృష్ణయ్యతో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కుటుంబంతో ఆనందంగా,ఆరోగ్యంగా శేష జీవితం గడపాలి

**జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు**
**ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం**

గద్వాల జూన్ 30(ప్రజా జ్యోతి ప్రతినిధి):ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ కుటుంబం కంటే సమాజానికే ఎక్కువ సమయం కేటాయించి సేవలందించే వారు పోలీసు సిబ్బందేనని,ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని గడుపుతూ ఆరోగ్యవంతమైన,ఆనందమైన జీవితాన్ని కొనసాగించాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సూచించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీసీఎస్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సివిల్ ఎస్సై చంద్రశేఖర్ (37 ఏళ్ల సేవ),గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సివిల్ హెడ్ కానిస్టేబుల్ శాంతయ్య గౌడ్ (41 ఏళ్ల సేవ),ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ ఎస్సై రాజశేఖర్ రెడ్డి (35 ఏళ్ల సేవ), ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ యల్ల శివాచారి (32 ఏళ్ల సేవ)లను జిల్లా ఎస్పీ పూలమాలలు,శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,విధి నిర్వహణలో ఈ అధికారులు ఎన్నో సవాళ్లు,ఒడిదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజలకు విశిష్ట సేవలందించారని కొనియాడారు.శాంతిభద్రతల పరిరక్షణలో అనేక సందర్భాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించడం పోలీసు సేవా తత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవం,క్రమశిక్షణ, సేవాభావం భావితర పోలీసు



అధికారులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.పోలీసు అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంలో వారి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని పేర్కొంటూ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతిరోజూ యోగ,వ్యాయామం చేయాలని,కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతూ సంతోషకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు.అలాగే తమ అనుభవాన్ని కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా పిల్లలకు మార్గదర్శకంగా అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.రిటైర్మెంట్‌తో పోలీసు శాఖతో అనుబంధం ముగిసిపోదని,శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి సతీష్ కుమార్,ఏఆర్ డీఎస్పీ టి.నరేందర్‌రావు,ఆర్ఐ (అడ్మిన్)నరేష్,గద్వాల టౌన్ ఎస్సై కళ్యాణ్ కుమార్,సీసీఎస్ ఎస్సై కృష్ణదేవ్,పోలీసు సిబ్బంది,ఉద్యోగ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు సెక్షన్ 30 పోలీసు చట్టం అమలు

**- అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సభలు నిర్వహించవద్దు: జిల్లా ఎస్పీ జానకి**

మహబూబ్‌నగర్, జూన్ 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ) శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా జూలై 1, 2026 నుంచి జూలై 31, 2026 సాయంత్రం 6 గంటల వరకు నెల రోజుల పాటు సెక్షన్ 30 పోలీసు చట్టం అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ దరావత్ జానకి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, పబ్లిక్ మీటింగ్‌లు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా లేదా ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.పోలీసుల అనుమతి లేకుండా నిబంధనలను ఉల్లంఘించి ధర్నాలు, ర్యాలీలు, సభలు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ జానకి హెచ్చరించారు.



## వనపర్తిలో బీజేపీలోకి బీఆర్ఎస్ గిరిజన నాయకుల చేరిక

వనపర్తి, జూన్ 30 (ప్రజాజ్యోతి): వనపర్తి జిల్లాలో బీజేపీ బలోపేతం దిశగా మరో అడుగు పడింది. బీఆర్ఎస్‌కు చెందిన వనపర్తి మండలం చిట్యాల పడమటి తండా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన శంకర్ నాయక్‌తో పాటు రవీందర్, రమేష్, హనుమంతు, హరావత్ మహేష్, మూడవత్ మహేష్ తదితర గిరిజన నాయకులు మంగళవారం బీజేపీలో చేరారు. వనపర్తి జిల్లా బీజేపీ కార్యాలయంలో మండల గిరిజన నాయకులు వశీరాం నాయక్, రేడ్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన నాయకులు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూతురి బుచ్చన్న, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుజ్ఞ రెడ్డి, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు కల్పన, గిరిజన మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్, మండల అధ్యక్షుడు సంద వెంకటేష్, గిరిజన నాయకుడు వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కానాయిపల్లిలో పౌర హక్కుల దినోత్సవం..

## రాజ్యాంగ హక్కులపై అవగాహన



**వనపర్తి, జూన్ 30 (ప్రజాజ్యోతి):**
కొత్తకోట మండలం కానాయిపల్లి గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వనపర్తి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చింతకుంట విశ్వంబాబు, ద్యారపోగు వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతకుంట విశ్వంబాబు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, మానవ గౌరవం వంటి ప్రాథమిక హక్కులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని అన్నారు. హక్కులకు భంగం కలిగితే చట్టపరమైన మార్గంలో న్యాయం పొందాలని సూచించారు. దళితుల భూ సమస్యలను సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ద్యారపోగు వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి నెల చివరి రోజున నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం ద్వారా ప్రజల్లో రాజ్యాంగ హక్కులపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమన్నారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కులమత భేదాలు లేకుండా అందరినీ సమానంగా గౌరవించాలని, ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ సంక్షేమ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్సై శివానంద్ గౌడ్, గ్రామ కార్యదర్శి రాజు, గ్రామపంచాయతీ అధికారి ఉషోదయ, సోషల్ వెల్ఫేర్ అధికారి సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లాలో ప్రజా ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ తనిఖీలు

**నారాయణపేట ప్రతినిధి జూన్ 30 (ప్రజా జ్యోతి)**



ఈరోజు ప్రజారోగ్య సంచాలకులు డా. రవీందర్ నాయక్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డిఎంహెచ్వో ) డా. కె. జయచంద్ర మోహన్ , ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. సిద్ధప్ప , ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సాయిరాం గారితో కలిసి మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి ) మరియు తీలైర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం లను ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు.
సందర్శన సందర్భంగా సిబ్బంది హాజరు నమోదు పుస్తకాన్ని పరిశీలించారు. పల్స్ పోలియో కార్యక్రమం అమలు, ఇంటింటి సర్వే (ఇంటింటి సర్వే ), సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టిన చర్యలు, అలాగే వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు మరియు నిర్దేశిత లక్ష్యాల సాధనపై సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.
మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపీ గది, ఫార్మసీ, లేబొరేటరీ, ప్రసూతి గది (లేబర్ రూమ్ )తో పాటు ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ప్రజలకు 24 గంటలపాటు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని సూచించారు.
ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య సేవల పట్ల రోగులు సంతృప్తి వ్యక్తం చేయగా, ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందిని ప్రజారోగ్య సంచాలకులు అభినందించారు.
అనంతరం ప్రజారోగ్య సంచాలకులు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం (జిల్లా వైద్యశాఖ కార్యాలయం )ను సందర్శించి కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యాలయ నిర్వహణ, సిబ్బంది అవసరాలు, ఎదురవుతున్న పరిపాలనా సమస్యలు మరియు వివిధ కార్యక్రమాల అమలుపై జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. కె. జయచంద్ర మోహన్ గారితో సమీక్ష నిర్వహించారు. ప్రజారోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, కార్యాలయ పనితీరు మెరుగుదల మరియు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## సిబ్బంది అందుబాటులో ఉండాలి.

### బాలసదనం, వృద్ధాశ్రమం ఆకస్మిక తనిఖీ –

### ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్

నారాయణపేట ప్రతినిధి జూన్ 30 (ప్రజా జ్యోతి)
మంగళవారం నారాయణపేట పట్టణంలోని బారం బావి వద్ద ఉన్న వృద్ధాశ్రమం, బాలసదనాన్ని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించి, హోమ్‌లో ఎంతమంది వృద్ధులు, చిన్నారులు ఉన్నారో ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనంపెడుతున్నారా లేదా అని తనిఖీ చేశారు. రోజూ తాజా కూరగాయలు, నాణ్యమైన బియ్యంతో వంట చేయాలని, తాగునీటి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్, అడ్మిషన్ రిజిస్టర్, డైలీ డైరీలతో పాటు సీసీటీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయ ఆర్డర్ల ప్రకారమే అడ్మిషన్లు తీసుకుంటున్నారా, సంబంధిత వ్యక్తులకు పిల్లలను, వృద్ధులను అప్పగిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. హోమ్‌లో నిల్వ ఉంచిన మందులు, టాబ్లెట్లు, సిరప్‌ల ఎక్స్‌పైరీ మందులు వెంటనే తొలగించాలని సూచించారు. అనంతరం వృద్ధులు, చిన్నారులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు, ఇతర అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి బిస్కెట్లు పంపిణీ చేసి, బంధువుల వివరాలు ఆరా తీశారు. బెడ్ రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, వాష్‌రూమ్‌లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, లైట్లు, ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లులు తీసుకొని రిజిస్టర్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని జడ్జి బి. సాయి మనోజ్ ఆదేశించారు.



## పరిరక్షణలో బీఎల్ఏలే కీలకం

### – ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి: బీఆర్ఎస్ నాయకులు



**వనపర్తి, జూన్ 30 (ప్రజాజ్యోతి):**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలని, ఓటు పరిరక్షణలో బీఎల్ఏలు కీలకంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 15, 19 వార్డుల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఓటరును బీఎల్ఏలు ప్రత్యక్షంగా కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అధికారులు కూడా ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షించి, సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కౌన్సిలర్ మురళీ సాగర్, మాజీ కౌన్సిలర్లు ఉంగ్లం తిరుమల్, బండారు కృష్ణ, ఇంతియాజ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## మూడు వారాలుగా నిలిచిపోయిన వీధి విద్యుత్ సరఫరా

### అధికారుల నిర్లక్ష్యంతో చీకట్లోనే ఐదో వార్డు ప్రజలు -- వెంటనే సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

**అడ్డాకుల, జూన్ 30 (ప్రజా జ్యోతి)**
అడ్డాకుల మండల కేంద్రంలోని ఐదో వార్డులో గత మూడు వారాలుగా వీధి విద్యుత్ సరఫరా నిలిచిపోయినా గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదో వార్డుకు చెందిన సకిలాల బుచ్చమ్మ, శివ మంగళవారం మాట్లాడుతూ, సమస్యపై గ్రామ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మూడు వారాలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలం కావడంతో రాత్రి వేళల్లో చీకటి అలుముకుని, విషసర్పాలు సంచరించే ప్రమాదం పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు రాత్రి సమయంలో బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి వీధి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## డ్రోన్ స్ప్రేయర్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### పిఏసిఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి

**కల్వకుర్తి, జూన్ 30 (ప్రజా జ్యోతి):**
వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం పిఏసిఎస్ కార్యాలయంలో రైతుల కోసం అత్యాధునిక పద్ధతిలో డ్రోన్ స్ప్రేను అందుబాటులోకి తీసుకొచ్చామని పిఏసిఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం పీఏ సీఎస్ కార్యాలయం వద్ద నూతన డ్రోన్ కు పూజ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు పిచికారికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఏ అవకాశాన్ని ఉరుకొండ కల్వకుర్తి మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వెంకటరెడ్డి కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# జర్నలిస్టులపై బెదిరింపులకు దాడులకు పాల్పడుతున్న మైనింగ్ మాఫియా పై కేసు నమోదు చేయాలి

## తహసీల్దార్‌పై అవినీతి ఆరోపణలు

## జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

నారాయణపేట ప్రతినిధి జూన్ 30 (ప్రజా జ్యోతి)

నారాయణపేట పట్టణం మరియు పరిసర మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్, ఆక్రమణలు జరుగుతున్నట్లు స్థానిక జర్నలిస్టులు ఆరోపించారు. వారు పేర్కొన్న సంఘటనలలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అక్రమ వసూళ్లు జరిగి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫిర్యాదులకు స్పందన లేకపోవడానికి సంబంధించిన ఆరోపణలు హెడ్లైన్‌గా ఉన్నాయి.

జర్నలిస్టుల సమితి తెలిపిన విషయాల ప్రకారం, గతంలో ప్రభుత్వ అవసరాల కోసం మంజూరు చేసిన మురం/రాళ్ల తవ్వక అనుమతులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు ప్రైవేటుగా పెద్ద ఎత్తున మైనింగ్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చెల్లుబాటు అయ్యే మైనింగ్ అనుమతులు లేకపోయినా ప్రభుత్వ గుట్టలలో మైనింగ్ కొనసాగుతుందన్నారు.అనుమానాల ప్రకారం, మైనింగ్ కార్యకలాపాలకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయం నుంచి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన ఫిర్యాదులు లభించాయని తెలిపారు. ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన విచారణ లేదా చర్యలు లేవని, భాదితుల అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని వారన్నారు.ఇవి తెలియజేసే ప్రయత్నంలో ఒక విలేకరికి సమాచారం అందించిన తర్వాత మైనింగ్ నిర్వాహకులకు సమాచారం చేరిందని, ఆ విలేకరిపై దాడి చేయడానికి ప్రయత్నించిన సంఘటన కూడా నమోదు అయింది. సంబంధిత ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు వేశారని వెల్లడించారు. ఈ దాడి ప్రయత్నం వెనుక



తహసీల్దార్ పరిచయం ఉన్నదని కూడా అనుమానాలు ఉన్నాయని వారు తెలిపారు.అలాగే, నారాయణపేట పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థాయి భూములు, ప్రత్యేకంగా సర్వే నంబర్ 14లో ఉన్న సుమారు ఒక ఎకరం స్థలాన్ని ఆక్రమించి ఉంచారని, ఆక్రమణపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోగా కొందరు ఆక్రమణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణ వచ్చినట్లు చెప్పారు. భూ రికార్డుల మార్పులు, మధ్యవర్తుల చేతిలో అక్రమ వసూళ్ల లావాదేవీలు జరుగుతుండటాన్ని కూడా జర్నలిస్టులు ఉద్ఘాటించారు.జర్నలిస్టులు అధికారులు మరియు సంబంధిత శాఖలపై నిష్పాక్షిక విచారణ చేయించి, నిజాలను బయటపెట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే అక్రమాలను వెల్లడించే వారికి డీజాస్టీభద్రత కల్పించాలని కోరుకుంటున్నారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్ రికి ఫిర్యాదు అందిందని తెలిపారు.

# శ్రీ శిరిడి సాయి సంస్థాన్ ట్రస్టుసేవలుఅభినందనీయం

## మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

కల్వకుర్తి, జూన్ 30 (ప్రజా జ్యోతి):
శ్రీ శిరిడి సాయి సంస్థాన్ ట్రస్టుసేవలుఅభినందనీయం మాజీ జెర్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శ్రీ షిరిడి సాయి సంస్థాన్ ట్రస్టు శేషశాయి కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగర్‌కర్నూల్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు విద్య బలమైన పునాది అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న శ్రీ షిరిడి సాయి సంస్థాన్ ట్రస్టు సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ట్రస్టు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ప్రధాన ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు ట్రస్టు సభ్యులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ జిల్లా రాములు, సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,





మాజీ ప్రజా ప్రతినిధులు దేశం వెంకట్రెడ్డి, మదన్ మోహన్ రావు, నిజాముద్దీన్, కడల మల్లేష్ యాదవ్, జితేందర్ రెడ్డి, రవి గౌడ్, గౌసుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో 1.12 లక్షల మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు

మహబూబ్‌నగర్, జూన్ 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లాలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ఇంటింటి సర్వే చేపట్టి, తొలి రోజు పోలియో చుక్కలు వేయించుకోని 0--5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ. శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 1,12,088 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమం రెండో, మూడో రోజుల్లో కలిపి 2,02,123 గృహాలను ఆరోగ్య సిబ్బంది సందర్శించి సర్వే నిర్వహించారని, తొలి రోజు పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి వారికి చుక్కలు వేయడం జరిగిందని తెలిపారు. మూడో రోజు కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శైలజ మోతీనగర్ ప్రాంతంలో ఇంటింటి సర్వే, పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.జిల్లాలో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో



చుక్కలు వేయించాలని, ఎవరూ మిగిలిపోకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## చాగాపురం ఘటనలో దాడి చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి:ఎంఆర్పీఎస్



**కే టి దొడ్డి జూన్ 30(ప్రజా జ్యోతి)**
:ఇటిక్యాల మండలం చాగాపురం గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా జరిగిన ఘర్షణలో దళితులపై దాడి చేసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని ఎంఆర్పీఎస్ కేటీదొడ్డి మండల ఇన్‌చార్జి గువ్వలదిన్నె జంబయ్య మాదిగ డిమాండ్ చేశారు.మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సోమవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో ఏరువాక తోరణం తెంపే కార్యక్రమంలో దళితులు పాల్గొనకూడదంటూ కొందరు కులవివక్షతో వ్యవహరించి, పోలీసుల సమక్షంలోనే దళితులపై చర్నకోలతో దాడి చేశారని ఆరోపించారు.ఇలాంటి విజ్ఞాన యుగంలో కూడా కులం,మతం పేరుతో దాడులు జరగడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు.దళిత మహిళా సర్పంచ్ పరిపాలనలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు.గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి దళితులకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.అలాగే ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించాలని,ప్రతి నెల 30వ తేదీన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ,ఆర్డీవో,తహసీల్దార్ గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా లయన్ తెప్ప శ్రీనివాస్ జన్మదినం

**-సేవ ఫౌండేషన్ ద్వారా అనాధలకు అన్నదానం**

**-అనాధలకు సేవ చేయడం నా అదృష్టం**

**-లయన్ డాక్టర్.తెప్ప శ్రీనివాస్**



నాగర్ కర్నూల్ : 30 (ప్రజా జ్యోతి)
అనాధలకు సేవ చేసే అవకాశం దొరకడం నేను అదృష్టంగా భావిస్తున్నానని లయన్స్ క్లబ్ మాజీ రీజియన్ ఛైర్ పర్సన్,సేవ ఫౌండేషన్ ఫౌండర్, త్రైక్వాండో అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డా.తెప్ప శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జడ్చర్ల పట్టణంలోని శ్రీ సత్తేశ్వర సేవాశ్రమంలో లయన్ తెప్ప శ్రీనివాస్ జన్మదినాన్ని
ఘనంగా నిర్యహించారు.ఈ సందర్భంగా లయన్ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ సత్తేశ్వర సేవాశ్రమంలో అభాగ్యులకు,అనాధలైన మానసిక వికలాంగులకు నా జన్మదిన సందర్భంగా అన్న ప్రసాదం పంపిణీ
చేయడం అదృష్టమని భావిస్తున్నానని,అంతేగాక పక్కవాడి ఆకలి తీర్చడంలో ఉన్న ఆనందం,వారి ఆశీర్వాదం తీసుకోవడం చెప్పలేనంత సంతోషం ఉందన్నారు.ముఖ్యంగా మనం సంపాదించిన దాంట్లో కొంత నిరుపేదలకు దానం చేయడంలో
ఉన్న సంతృప్తి వర్ణనాతీతమని,ప్రతి సంవత్సరం ఇదేవిధంగా జన్మదిన వేడుకలు చేసుకుంటూ అనాధలకు మరియు అభాగ్యులకు అన్నదానం చేసే అదృష్టం భగవంతుడు నాకు కలిగించాలని ప్రార్థిస్తున్నాని అన్నారు.

